సి.పి. బ్రౌన్ అకాడమి - స్వాతి వార పత్రిక సంయుక్తంగా నిర్వహించిన

దసరా కథల పోటీలో ప్రత్యేక బహుమతి పొందిన కథ

# పాత నీరు



'బ్రహ్మం టైప్ ఇన్‌స్టిట్యూట్. టైపు, షార్ట్ హ్యాండ్ నేర్పబడును'

అలవాటు ప్రకారం నా షాపుపైన అమర్చిన బోర్డు వంక పిసరంత గర్వంగా చూశాను.

రాజ్యం పోయినా రాజసం పోని మహారాజులా ఉంది. రంగు వెలిసింది. కొంతభాగం తుప్పు తినేసింది.

అయినా ఠీవిగానే కన్పించింది.

ఇన్‌స్టిట్యూట్ తాళం తీసి లోపలికెళ్ళి తలుపులు దగ్గరకి వేసి చీపురందుకున్నాను. పిమ్మట టైప్‌మిషన్ల మీది కవర్లన్నీ తొలగించి ఒక మూల ఒజ్జుగా పెట్టాను. తపస్సు చేస్తున్న మునీశ్వరుల్లా ఉన్నాయి టైప్ మిషన్‌లు–హెూల్డా, రెమింగ్‌టన్, గోద్రేజ్, ఫేసిట్.....

వాటివంక అపురూపంగా చూసి మెత్తని గుడ్డతో వాటిని తుడిచాను. షాపు తలుపులు బార్లా తెరిచాను.

ఈశాన్యం మూలలో ఉన్న లక్ష్మీవినాయక సరస్వతి ఫోటో ముందు బుల్లి పళ్లెంలో పటికబెల్లం ముక్క పెట్టేను. కర్పూరహారతి ఇచ్చి దణ్ణం పెట్టుకున్నాను. రెండు అగరువత్తులు వెలిగించి దేవుళ్ళ ఫోటోకి నా గల్లా పెట్టె అయిన డ్రాయరు సొరుగుకీ టైప్ మిషన్లకీ ధూపం వేశాను.

టేబుల్ వెనుకనున్న కుర్చీని కొంచెం జరిపి కూర్చుని దినపత్రిక చేతుల్లోకి తీసుకున్నాను.

"నమస్కారం బ్రహ్మంగారూ" అంటూ వచ్చి పలకరించాడు పక్క షాపతను.

"నమస్కారం. ఇవాళ ఆలస్యమయ్యిందేం...."

"మీరంటే ఠంచనుగా తెరుస్తారు. నాకెక్కడ కుదురుద్ది చెప్పండీ. అల్లుడొచ్చాడు. బజారుకెళ్ళి చేపలు కొనుక్కొచ్చేసరికి ఆలస్యమైపోయింది...."

"మీ అల్లుడికి ఉద్యోగం వచ్చిందా"

"ఇంకా లేదు. హైదరాబాదులో కంప్యూటర్ కోర్సులు నేర్చుకున్నాడు కదా, నెలా రెండు నెలల్లో వచ్చేస్తుందన్నాడు. మొదటి నెలలోనే ఇరవై వేలు పైచిలుకు జీతం వస్తుందిట...."

"అవునవును. ఇవాళా రేపు సంపాదనంతా వాళ్ళదే"

"ఈ టిక్కు టిక్కు టైప్‌మిషన్లు అమ్మేసి కంప్యూటర్లు కొనరాదూ. మళ్ళీ ఓ వెలుగు వెలుగుదురుగాని......

"మనకి లాభంలేదు లేవయ్యా"

"అసలు ఇదీ మీకనవసరమే. ఒక కొడుకు అమెరికాలో రెండో కొడుకు హైదరాబాదులో. ఇద్దరు కొడుకులూ రెండు చేతులా సంపాదిస్తున్నారు. కాలుమీద కాలు వేసుక్కూర్చోక ఇంకా ఈ పాట్లెందుకూ!"

"ఇందులో పాట్లూ కష్టమూ ఏముందీ. చేతిలో విద్య వుంది. ఆసక్తి వున్నవాళ్ళకి నేర్పుతున్నాను. అడపాదడపా జాబ్‌వర్క్ చేస్తున్నాను. మా ఇద్దరి పొట్టలూ నిండుతున్నాయి. కాలం ఏ చీకూ చింతా లేకుండా గడిచిపోతోంది. అంతకన్నా ఇంకేం కావాలి చెప్పు...."

"మీరీ కాలానికి సరిపడరు బ్రహ్మంగారూ. అంతా నానా గడ్డికరిచి అయినాసరే మేడ మీద మేడ కట్టాలని చూస్తోంటే మీరు నిమ్మకి నీరెత్తినట్టు వుంటారు!" నవ్వి పేపర్లో తలదూర్చాను.

ఈ టైప్ ఇన్‌స్టిట్యూట్‌ని పెట్టి సుమారు నలభై అయిదేళ్ళు కావస్తోంది. టౌన్లో ఇలాటిది మొట్టమొదటిగా పెట్టింది నేనే. ఆ రోజుల్లో ఉద్యోగానికి గ్రాడ్యుయేషన్‌తోబాటు టైపూ, షార్ట్‌హ్యాండూ వచ్చి ఉండడం అదనపు అర్హతగా గుర్తించేవారు. చదువుకుంటున్న వాళ్ళూ, చదువు పూర్తైనవారూ వచ్చి నేర్చుకునేవారు. అరవై, డెభ్భై, కొంతవరకూ ఎనభై దశకాలు నాకూ నా ఇన్‌స్టిట్యూట్‌కూ స్వర్ణయుగమని చెప్పాలి.

ఉదయం ఆరుగంటల నుంచి రాత్రి తొమ్మిదింటి వరకూ బ్యాచ్‌లు బ్యాచ్‌లుగా వచ్చేవారు. షార్ట్ హ్యాండ్‌కు మళ్ళీ విడిగా క్లాసులుండేవి. కోర్టుకి దగ్గర్లో ఉన్నందున ప్లీడర్లు రకరకాల పిటీషన్లు టైప్ చేయించుకునేవారు. ఇహ ఉద్యోగార్థులు సర్టిఫికెట్ల 'ట్రూ కాపీలు' చేయించుకోవడానికి బారులు తీరేవారంటే అతిశయోక్తి కాదు.

మా పెద్దబ్బాయి వాల్తేరులో ఎమ్మెస్సీ చదివాడు. చిన్నవాడు విజయవాడలో ఇంజనీరింగ్ చేశాడు. నేను స్వంతంగా ఇల్లు కొనుక్కున్నాను. ఇదంతా ఇన్‌స్టిట్యూట్ చలవే. తాడూ బొంగరం లేని నేను ఇవాళింత నిశ్చింతగా ఉన్నానంటే ఇదంతా ఇన్‌స్టిట్యూట్ ఘనతే. అందుకే నాకిది దేవాలయంలానే అన్పిస్తుంది. కన్పిస్తుంది.

"బ్రహ్మంగారూ" హడావిడిగా వచ్చాడు ప్లీడర్ వాసుదేవరావుగారి జూనియర్. "ఈ ఇరవై పేజీలూ బాండు పేపర్ మీద టైపు చేసివ్వాలి. అర్జంట్"

అతని చేతిలోని పేపర్లందుకుంటూ "ప్లీడర్ గారి ఆఫీసులో కంప్యూటర్ వుందిగా" అన్నాను.

"కంప్యూటరూ వుంది, ఆపరేటరూ వుంది. ఆవిడ చేసి నేను చూసి, ఆవిడ దిద్ది నేను ఫైనల్ కాపీ తీసుకెళ్ళేసరికి మేజిస్ట్రేటు బెంచీ దిగిపోతారు. ఇదే మీరైతే పది నిమిషాల్లో పనైపోతుంది. తిరిగి చూడాల్సిన అవసరమే ఉండదు"

నాకు చాలా సంతోషం వేసింది. అతడన్నది అక్షర సత్యం. నిమిషానికి 90-100 వరడ్స్ టైప్ చేసేస్తాను. ఒక్క తప్పూ దొర్లదని ధీమాగా చెప్పగల్ను.

పేపర్లు ప్యాడ్‌కి తగిలించి మిషన్ ముందు కూర్చున్నాను. కళ్ళు అక్షరాల వెంట పరుగెత్తాయ్. వేళ్ళు కీబోర్డు మీద నాట్యమాడాయి. మిగతా ప్రపంచాన్ని మర్చిపోయాను. పది నిమిషాల్లో అతనికి పేపర్లందిస్తూ-

"ఒకసారి చూసుకో" అన్నాను.

"బ్రహ్మంగారు టైప్ చేస్తే తప్పు పట్టుకోవడం ఆ బ్రహ్మకీ సాధ్యంకాదు" యాభై నోటిస్తూ అన్నాడు.

"పంప్‌ని పింప్ అనీ, ఫ్లష్‌ని అనీ పఫ్ తొందర్లో రాసినట్టున్నారు. కరెక్టు చేశాను"

"మీ ఇంగ్లీష్ ముందు మావన్నీ వానాకాలం చదువులే కదాండీ" అంటూ వెళ్ళిపోయాడు.

"బొత్తిగా బేరాలు వుండడం లేదు బ్రహ్మంగారూ" పక్క ఫ్యాన్సీ షాపతను వచ్చి కూర్చుంటూ అన్నాడు.

"చిన్న టౌన్‌లలో కూడా సూపర్ బజార్లూ, షాపింగ్ మాల్సూ వచ్చేస్తున్నాయి. ఇహ చిన్న దుకాణాలూ చిల్లర వ్యాపారాలూ చేతులెత్తెయ్యక తప్పదు"

"అలాగే వుంది కాలం. పేపర్ విశేషాలేంటండీ. బాబ్లీ గొడవ ఏమవ్వుద్దంటారు"

"ఏమీ అవ్వదు. మన మొత్తుకోళ్ళు దున్నపోతు మీద కురిసిన వాన చందమే కదా"

"బాగా చెప్పారు"

భోజనం వేళయ్యింది. ఇన్‌స్టిట్యూట్ చూస్తూండమని ప్రక్కతనికి చెప్పి బయల్దేరాను.

కోర్టు ప్రక్కనుంచెళ్తోంటే నా కాళ్ళు కోర్టు గోడనానుకుని వున్న అరుగు దగ్గరకి లాక్కెళ్ళాయి. రోజుకొక్కసారైనా అక్కడ కూర్చోకపోతే మనశ్శాంతిగా ఉండదు.

ఎస్సెస్ఎల్సీ పాసయ్యాక టీచర్ ట్రైనింగుకి వెళ్దామనుకొంటోంటే కాలేజీలో టైపిస్టు పోస్టు ఖాళీగా వుందనెవరో మా నాన్నకి చెప్పారు. వెంటనే టైప్ నేర్చుకుని రమ్మని ఏలూర్లో వుంటోన్న మా బంధువులింటికి తరిమేరు.

నేను తిరిగొచ్చేసరికి ఆ పోస్టులో ఎవర్నో నియమించేశారు. ఇలా అయిందేవిటా అని విచారిస్తోంటే, "టైప్ మిషన్ కొనుక్కుని కోర్టు ప్రక్కన కూర్చోరా నాలుగు రాళ్ళొచ్చిపడ్తాయి" అన్నాడు ప్లీడర్ గుమాస్తా అయిన మా మేనమావ. ఎత్తైన స్టూలుమీద టైప్ మిషన్ పెట్టుకుని ఇదిగో ఈ అరుగుమీదే కూర్చుని టైప్ చేసివ్వడం మొదలెట్టాను. ప్లీడర్లూ, గుమాస్తాలూ, ఉద్యోగపు వేటలో వున్నవాళ్ళూ బాగానే వచ్చేవారు.

రెండు చేతుల్నిండా పనే పని. సంపాదన పెరిగింది. దానితోబాటు పోటీ మొదలైంది. దీన్నే నమ్ముకుని ఉంటే లాభం లేదని మరో నాలుగు మిషన్లు కొని ఒక షాపు అద్దెకు తీసుకుని టైప్ ఇన్స్టిట్యూట్ ప్రారంభించాను. మరి వెనుదిరిగి చూడలేదు. కంప్యూటర్ల కాలం వచ్చే వరకూ నాకు అడ్డులేకపోయింది.

ఆ రోజుల్లోనే ఊరి సమస్యల గురించి ముఖ్యమంత్రికీ, రాష్ట్రపతికీ తరచూ పిటీషన్లు పంపుతూ వుండేవారు గుర్నాథం. తెలుగులో రాసుకొచ్చేవారు. వాటిని ఇంగ్లీషులోకి అనువదించి టైప్ చేసిచ్చేవాణ్ణి. నన్నూ నా వ్యాపారాన్నీ చూసి ముగ్ధుడైన ఆయన తిన్నగా మా ఇంటికెళ్ళి పిల్లనిస్తానని చెప్పి అమ్మా నాన్నల్ని ఒప్పించేశారు.

సరిగ్గా అప్పుడే ఇన్స్టిట్యూట్ పెట్టిన షాపు అమ్మకానికొస్తే ఆయనిచ్చిన కట్నండబ్బుతో దాన్ని కొనేశాను. షాప్ స్వంతం గనుక ఇప్పుడు సంపాదనవున్నా లేకపోయినా గడిచిపోతోంది. లేకపోతే నెలకి వెయ్యి రూపాయలు అద్దె కింద పోయాలంటే నా తరమయ్యేదే కాదు.

ఆప్యాయంగా అరుగునీ, గోడనీ నిమిరి లేచాను.

ఇంటికెళ్ళేదారిలో వున్న కంప్యూటర్ ట్రెనింగ్ సెంటర్ దగ్గర క్షణకాలమాగాను. రోజులానే రష్‌గా ఉంది. దాన్ని ముగ్గురు యువకులు కలసి పెట్టారు.

ఎమ్మెస్ ఆఫీసు నుంచి జావా దాకా అన్నీ నేర్పుతున్నారు. దాని ప్రక్కన డీటీపీ సెంటరు కూడా వుంది.

ఇవాళ రేపు అన్నిరకాల పనులకీ జనం అక్కడికే వెళ్తున్నారు. దాని యజమాని యువకుడు. నిండా పాతికేళ్ళు ఉండవు. ఇంగ్లీష్, తెలుగు రెండూ కూడా చకచకా చేసేస్తున్నాడు. అన్నిరకాల ప్రొఫార్మాలూ కంప్యూటర్లో పెట్టుకుని, ఎవరికేది కావలిస్తే అది వారి వివరాలతో నింపి క్షణాల్లో ఇచ్చేస్తున్నాడు.

"మీరూ కంప్యూటర్ నేర్చుకోండి నాన్నగారూ. టైపు చేసినట్టే చేస్తారు. ఫైల్ ఓపెనింగూ, సేవింగూ లాంటివి నేర్చుకుంటే చాలు. మీరు ఇట్టే పట్టేస్తారు. ఎంతో హాయిగా, తేలిగ్గా సౌకర్యంగా ఉంటుంది. చేతినిండా పనీ ఉంటుంది" అన్నారు అబ్బాయిలు చాలాసార్లు.

పెద్దోడైతే అమెరికా నుంచి ఇక్కడికొచ్చేప్పుడల్లా "కంప్యూటర్ కొని తీసుకురానా" అంటూంటాడు. నాకెందుకో ఇష్టం లేదు. ఆ పరుగు వేగం ఈ వయసులో నాకనవసర మన్పిస్తూంటుంది.

నాకు తెలీకుండానే నిట్టూర్చాను.

కాళ్ళు కడుక్కొంటోంటే, "చిన్నోడు ఫోన్ చేశాడు" అంది ఇల్లాలు సుబ్బులు.

"ఏమంటున్నాడూ"

"ఎప్పుడూ పాడే పాటే. ఇన్‌స్టిట్యూట్ మూసేసి తన దగ్గరకి వచ్చేసెయ్యమంటున్నాడు"

"ఇక్కడ బాగానే వుందని చెప్పలేకపోయావా"

"చెప్పకుండా ఎలా వుంటానూ. చెప్పేను. అయినా మీ చాదస్తం గాకపోతే లిక్కులిక్కుమంటూ మనిద్దరం ఇక్కడ వుండటం ఎందుకండీ. హైదరాబాదెళ్ళిపోయి అబ్బాయితో, మనవళ్ళతో కలిసుందాం"

"కాలూ చెయ్యీ బాగానే ఆడుతున్నాయి కదే. ఇన్‌స్టిట్యూట్ మీద పదో పరకో వస్తోంది. మన కష్టం తింటూ కూర్చోగలగటం కన్నా అదృష్టమేముంటుందే పిచ్చిదానా" కంచం ముందు కూర్చుంటూ అన్నాను.

"మీ వేదాంతమే మీది కాని నా మాట విన్పించుకోరుకదా. మన పెళ్ళైన కొత్తలో ఉద్యోగానికి వెళ్ళమని మా నాన్న పోరితే ఏమన్నారో గుర్తుందా? 'మా నాన్నకి ఈ ఊరొదలటం ఇష్టంలేదు, మా అమ్మకి బోదకాలు ఎక్కడికీ తిరగలేదు'- అని చెప్పి ఈ ఊరికే అతుక్కుపోయారు. ఇప్పుడేమో మీరు మన పిల్లలకి దూరంగా వుందామంటున్నారు. మీదంతా రెండు నాల్కల ధోరణి!" కంచంలో రపీమని కూరవేస్తూ మూతి ముడిచింది.

"ఆ కాలం వేరు ఈ కాలం వేరు. కాలాన్ని బట్టి నడుచుకోవాలే. అప్పుడే సుఖంగా ఉంటాం"

"అబ్బో! ఎంత సుఖపడిపోతున్నామో!"

"కొడుకుల ముందు చేయి చాచక్కర్లేకపోతోంది కదే. ఇంతకంటే ఏం కావాలి చెప్పు"

"కొడుకు సంసారాన్ని కళ్ళెట్టుకుని చూట్టం కన్నానా!"

"కావాలంటే చుట్టపు చూపుగా వెళ్ళి చూడొచ్చుగాని అక్కడే తిష్ఠ వెయ్యకూడదు"

"నాకు తెలీక అడుగుతాను, వేస్తే ఏమవ్వుద్దంట?" అంది సుబ్బులు.

"బజారుకి వెళ్ళి కాయగూరలు తెమ్మని కోడలుపిల్ల నా చేతికి సంచి ఇచ్చిందనుకో, అది మనింటి పనే అని నేను సరిపెట్టుకోగలనా? పనిమనిషి రాలేదు నాలుగంట్లు తోమమని నీకు చెప్పిందనుకో మనస్సులో ఏమీ అనుకోకుండా నువ్వు చెయ్యగలవా చెప్పు?"

"ఇలాగే ఏదేదో చెప్పి నా నోరు మూయిస్తూ వుంటారు. ఇవాళ కొత్తా ఏం? ఆ ఇన్స్టిట్యూట్‌ని వదిలి వుండలేనని మాత్రం చెప్పరు. నాకు ఇల్లే వైకుంఠం మీకా ఇన్స్టిట్యూటే కైలాసం!" అంటూ మురిపెంగా నవ్వింది. మురిసిపోయాను.

"నీ నవ్వు బావుంటుంది సుబ్బులూ..... మజ్జిగచారూ బావుంది. ఇంకాస్త వడ్డించు. ఏమైనా నీచేతిపంట రుచేవేరు"

"నన్నేమీ మీరు మునగచెట్టు ఎక్కించక్కర్లేదు" అంటూ ముసిముసిగా నవ్వింది సుబ్బులు.

ఒక్క కునుకు తీసి టీ తాగి ఇన్స్టిట్యూట్‌కెళ్ళాను.

ఒకమ్మాయి నాకోసం ఎదురుచూస్తూ కూర్చుంది.

"టైప్ నేర్చుకుంటే కంప్యూటర్ త్వరగా వస్తుందిట కదండీ. అందుకని నేర్చుకుందామనొచ్చాను"

"చాలా సంతోషం. రోజుకి గంట చొప్పున వస్తానంటే నెలకి మూడొందలవు తుంది....."

"టైప్ నేర్చుకోవడం మంచిదే కదండీ"

"చాలా మంచిదమ్మాయ్. రెండింటి కీ బోర్డులూ ఒక్కటే. టైప్‌మిషన్ని బట్టే కంప్యూటర్ని తయారుచేశారు. ఎందులోనైనా సరే స్కిల్లు పెంచుకుంటే ఇంక తిరుగుండదు"

ఆమె డబ్బివ్వగా నోట్‌బుక్‌లో రాసుకున్నాను.

పాత హాల్డా టైప్ మిషన్ ముందు కూర్చోబెట్టి కీబోర్డు మీద వేళ్ళని ఎలా ఆన్చాలో చెప్పి 'a s d f g h j k l ;' టైప్ చెయ్యమన్నాను.

"ఎబిసిడిలు వరుసగా నేర్పరా?'

"అన్నప్రాసన నాడే ఆవకాయ పెట్టరమ్మా. మొదట ఈ వరస తర్వాత పైవరస ఆ తర్వాత క్రింది వరస నేర్చుకోవాలి. అప్పుడు ఎబిసిడిలు వరుసగా చెయ్యడం వస్తుంది"

"బొత్తిగా పాత మిషను" ప్రక్కనే మెరుస్తోన్న గోద్రెజ్ వంక చూస్తూ నసిగింది ఆ అమ్మాయి.

"లెర్నర్స్ దీని మీదే నేర్చుకోవాలి. మొదట్లో మీ టచ్ హార్డ్‌గా వుంటుంది. తర్వాత మిగతా వాటిమీద నేర్చుకోవచ్చు. అవన్నీ ఫెదర్ టచ్" సమాధానపరిచాను.

ఆమె దారిలో పడేదాకా ప్రక్కనే నిలబడ్డాను.

ఒక పాతికేళ్ళ యువకుడొచ్చాడు. "ఇది టైప్ చేసివ్వండి" నిర్లక్ష్యంగా అన్నాడు.

పేపర్ ప్రకటన చూసి తనకే ఉద్యోగమివ్వమంటూ అర్థిస్తూ రాసిన అప్లికేషన్ అది.

"ఎవర్రాశారు?"

"నేనే"

"చాలా తప్పులున్నాయే...."

"పూర్తిగా నేను రాయలేదు కొంత మా బాబాయి రాశాడు...." గాలి తీసిన బుడగవుతూ అన్నాడు.

"ఎవర్రాసినా ఇన్ని తప్పులతో రాస్తే ఎవరు ఉద్యోగమిస్తారు? పైగా నీకు ముసలి తల్లిదండ్రులు గాక పడుచు పేరెంట్స్ ఎలా ఉంటారు చెప్పు? బీదరుపులు విని జాలిచూపులు చూసి ఎవరూ ఉద్యోగాలివ్వరు. ప్రతిభని చూసి ఇస్తారు. తమ పని చక్కబెట్టగలడన్న నమ్మకం కుదిరితే ఇస్తారు. అంచేత నీ శక్తి సామర్థ్యాలు తెలియజెప్పేట్టుగా రాయాలితప్ప ఇలాక్కాదు"

"మీరన్నీ తెలిసినవారు. ఎలా బావుంటుందంటే అలా మార్చి రాయండి సార్...." అన్నాడతను.

"నీ గురించీ నీ ప్రతిభాపాటవాల గురించీ చెప్పు"

అతడు చెప్పిందానికి మరికొంత చేర్చి చక్కగా టైప్ చేసిచ్చాను. పొంగిపోతూ డబ్బిచ్చాడు.

"ఖాళీగా కూర్చుంటే ఉద్యోగాలు రావు. కంప్యూటర్ కోర్సులు నేర్చుకో. బ్యాంక్ పరీక్షలకు ప్రిపేరవ్వు. పోటీ దృక్పథం పెంచుకో" అంటూ క్లాస్ తీసుకున్నాను. అన్నిటికీ తలూపి ఒక రకంగా పారిపోయాడు.

కాస్సేపు డిక్షనరీ తిరగేస్తూ కూర్చున్నాను. రోజుకో పది కొత్త వరడ్స్‌ని బట్టీ పట్టడం ఇప్పటికీ నా అలవాటు. నేను కాలేజీలో చేరకపోయినా నాకు చక్కని ఇంగ్లీష్ వచ్చని నా నమ్మకం. ధీమా కూడా.

చీకటి పడుతూండగా ఇన్‌స్టిట్యూట్ ముందు చిన్న కారు ఆగింది. ఆసక్తిగా చూశాను. ఒక సూట్ ధరించిన వ్యక్తి అందులోంచి దిగి తిన్నగా నావైపు రాసాగాడు.

నా గుండె గుభిల్లుమంది. ఈ మధ్య సర్వీసు టాక్సూ అదీ ఇదీ అంటున్నారు. ఆదాయం అంతంత మాత్రమే వుంటోంది గనుక అవేమి కట్టడం లేదు. కొంపతీసి.....!

నోటి తడారిపోతోంటే లేచి ఆహ్వానిస్తూ నా కుర్చీ ఎత్తి అతడికి వేశాను.

"వద్దొద్దు. మీరే కూర్చోండి మాస్టారూ" స్వీట్స్ డబ్బా నా చేతిలో పెట్టి నా కాళ్ళకి నమస్కరించాడు. తబ్బిబ్బుపడ్డాను.

"నేను గుర్తున్నానా మాస్టారూ? మీ స్టూడెంటుని" అన్నాడతను.

తేరిపారి చూశాను. గుర్తురాలేదు. ఎందరెందరో ఇక్కడ ఎ ఎస్ డి ఎఫ్ జి లు నేర్చుకున్నారు. వాళ్ళలో ఒకడై వుంటాడు.

"నేను మాస్టార్రూ జగన్నాథం గారబ్బాయి ఆదిశేషుణ్ణి. ఆదీ అంటూ ప్రేమగా పిలిచేవారు. టైప్ లోయర్ నేర్చుకోడానికొస్తే అదొక్కటే చాలదంటూ షార్ట్‌హ్యాండ్‌కీ కట్టించారు"

"అహ.....అలాగా..... సంతోషం. ఇప్పుడేంచేస్తున్నావూ"

"జనరల్ మేనేజర్ పి.ఏ.గా చేరాను. అంచెలంచెలుగా ఎదిగి ఇప్పుడు జనరల్ మేనేజర్ని అయ్యాను. ఇదంతా మీరు పెట్టిన భిక్షే మాస్టారూ. మీ ఆశీర్వాదం తీసుకోవాలనే ప్రత్యేకంగా వచ్చాను" అన్నాడు అభిమానంగా.

నా కళ్ళు చెమర్చాయి. స్వీటు బాక్సులోంచి లడ్డూ తీసి అతడి నోట్లో కుక్కాను. ఫలభరితమైన చెట్టుని చూసే రైతులా చూశాను. వేనోళ్ళ పొగిడాను. ఇంకా ఇంకా వృద్ధిలోకి రావాలని ఆశీర్వదించాను.

గుండెలు సంతోషంతో ఉక్కిరిబిక్కిరవుతున్నాయి. రోజూకన్నా ముందుగానే ఇన్‌స్టిట్యూట్‌కి తాళం వేసేసి గబగబా ఇంటికి వెళ్ళేను.

"గాలిలో తేలిపోతున్నారేవిటీ!" గుమ్మంలోనే అడిగింది సుబ్బులు.

స్వీట్స్ డబ్బా తెరచి "తీసుకోవే" అన్నా ఫోజుకొడుతూ.

"విశేషం ఏవిటో" అంది సుబ్బులు.

"నా స్టూడెంట్ జనరల్ మేనేజరయ్యాడే. నేను నీరు పోసిన మొక్క కాపు కొచ్చిందే. ఇలాగే ఉన్నతోన్నత స్థాయి కెదిగిన వాళ్ళెందరు ఎందరున్నారో లెక్కలేదు. అది తలచుకుంటే చాలు గుండెలు ఆనందంతో ఉప్పొంగిపోతున్నాయే సుబ్బులూ. తృప్తితో కాళ్ళు గాలిలో తేలిపోతున్నాయంటే నమ్ము. ఇంతకంటే ఎవరికైనా ఏం కావాలే!?"

"సంబరం సంతకెల్ల. ఇంత దానికి అంత పొంగిపోతారు!" అంది స్వీట్ తీసుకుంటూ.

"అలా తక్కువ చెయ్యకే. నిన్న టైప్ మిషన్. ఇవాళ కంప్యూటర్. రేపింకొకటి. కాలానుసారం మారుతూనే వుంటాయే. కొత్తనీరు వస్తుంది. పాతనీరుని తరిమేస్తుంది. కాని పాతనీరు కూడా ఒకప్పుడు కొత్తనీరేనే. అదీ తన విద్యుక్తధర్మాన్ని నిర్వర్తించిందేనే.

నేనూ అంతే. ఇవాళ పనిలేనివాడ్నీ, పనికిరానివాడ్నీ కావచ్చుగాక. కాని ఒకప్పుడు నేను కూడా చక్కని పాత్ర పోషించాను. ఎందరెందరికో జీవనోపాధి కలిగించాను చక్కని భవిష్యత్తుకి బాట వేశాను.

నేనూ, నా ఇన్‌స్టిట్యూట్ వృధా కాలేదు. ఒక చారిత్రక పాత్రని ఒక సామాజిక బాధ్యతని నిర్వర్తించాం. నాకు చాలా చాలా ఆనందంగా ఉంది సుబ్బులూ. మన బిడ్డలు ఉన్నతస్థాయికెదిగినప్పటి కన్నా పదిరెట్లు సంబరంగా ఉంది. నాకీ తృప్తి చాలు. నా జన్మ ధన్యమైంది!"

ఆనందోద్విగ్నుణ్నై ఊగిపోతోంటే నా వంక అభినందిస్తూ చూసింది సుబ్బులు. ఆప్యాయంగా నా చేయి నొక్కుతూ నవ్వింది. అది నవ్వు కాదు – విజయానందం! సంతృప్త జీవనానికది సంకేతం!!

**(స్వాతి సపరివారపత్రిక 4.3.2011)**